క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్య పనులు

నింద్ర: వర్షాకాలం కారణంగా అతిసార, డయేరియా వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను వార్డు మెంబర్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అరుణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒక సారి శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంక్‌లో నీటిని నిలిపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి, నీరు సరఫరా చేయాలన్నారు. ప్రతి ఒక్కరు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో వున్న మహాలక్ష్మి అమ్మ వారి దేవాలయంలో బుధువారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

విజయపురం: మండలంలోని కొత్త ఇల్లత్తూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ హెచ్‌ఎం చంద్రయ్య విద్యా సామగ్రి పంపిణీ చేశారు. బుధవారం పాఠశాల హెచ్‌ఎం పద్మావతి చేతుల మీదుగా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అందించారు. ప్రభుత్వం పాఠశాలలోనే నాణ్యమైన విద్యతోపాటు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నాయని తెలిపారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. గర్భిణులకు, చిన్నారులకు వేస్తున్న టీకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో డాక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రిలోనే చేయాలని, అప్పుడే మాతా శిశు మరణాలు జరగవన్నారు. గర్భిణులు ప్రసవం వరకు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పాలసముద్రం: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత బాధ్యత సంబంధిత గ్రీన్‌అంబాసిడర్లపై ఉందని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ రామనాథరెడ్డి ఆదేశాల మేరకు పాలసముద్రం గ్రామ సచివాలయంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి ధరణిప్రసాద్ గ్రీన్‌అంబాసిడర్లతో సమీక్షించారు. గ్రీన్‌అంబాసిడర్లు తడి-పొడి చెత్తలను తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం పాలసముద్రం హైస్కూల్ ఆవరణలో గ్రీన్‌అంబాసిడర్లతో పిచ్చి మొక్కలు తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు.

అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనవద్దు

పుత్తూరు: పట్టణ పరిధిలో తుడా, డీటీసీపీ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లలో ప్లాట్స్ కొనుగోలు చేయరాదని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ పరిధిలోని పలు రెవెన్యూ లెక్క దాఖలలో ఏర్పాటు చేసిన లేఅవుట్లకు ఎలాంటి అనుమతులు లేవని, సదరు లేఅవుట్స్‌లో ప్రజలెవ్వరూ ప్లాట్లు కొనుగోలు చేయవద్దని కోరారు. అక్రమ లేఅవుట్స్‌కు సంబంధించిన వివరాల జాబితాను కమిషనర్ వెల్లడించారు.

లైన్‌మన్ కనబడుట లేదని ఫిర్యాదు

పుత్తూరు: వడమాలపేట మండలం అప్పలాయగుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్‌గా పనిచేస్తున్న ఉమాశంకర్(46) మంగళవారం నుంచి కనబడుట లేదని అతని భార్య మయూరి బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుత్తూరు పట్టణంలోని బెస్తవీధికి చెందిన ఉమాశంకర్ 2004లో విద్యుత్ శాఖ ఉద్యోగంలో చేరాడు. గత ఏడాది అప్పలాయగుంట సబ్‌స్టేషన్‌కు లైన్‌మన్‌గా బదిలీపై వచ్చాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వచ్చిన ఉమాశంకర్ మంగళవారం ఉదయం డ్యూటీ దిగాడు. క్యారీ బ్యాగును ఆఫీసులోనే వదిలిపెట్టి వెళ్లాడు. మంగళవారం సాయంత్రానికి భర్త ఇంటికి రాకపోవడంతో మయూరి ఫోన్ చేసింది. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో అప్పలాయగుంట సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసింది. ఉదయమే డ్యూటీ దిగి వెళ్లిపోయినట్లు సిబ్బంది సమాధానం చెప్పారు. బుధవారం సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో తన భర్త ఉమాశంకర్ కనుబడుట లేదని వడమాలపేట పోలీసులకు మయూరి ఫిర్యాదు చేసింది. తన భర్తకు కరోనా సోకిందని ఆ సమయంలో రూ.8 లక్షల వరకు ఖర్చు పెట్టినట్లు, అప్పటి నుంచి ఉమాశంకర్ డిప్రెషన్‌లో ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మయూరి పుత్తూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది.

వైద్యులకు భద్రతపై భరోసా కల్పించాలి



కోల్‌కతా ఘటనతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లోని వైద్యులు, వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. ఎవరైనా దాడులు చేసినా కఠిన శిక్షలు అమలు చేయాలి. సుప్రీంకోర్టు సూచనలు పరిగణనలోకి తీసుకోవాలి. మహిళా సిబ్బంది భద్రతకు భరోసా కల్పించాలి. – మోహన్‌క్రిష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి, పాలసముద్రం



త్వరగా శిక్ష పడేలా చేయాలి



తప్పు చేసిన వారికి త్వరగా శిక్ష పడేలా చేయాలి. వైద్య సిబ్బంది భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్య సిబ్బందిపై దాడులు, అత్యాచారాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి. ముఖ్యంగా వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పిస్తూ వ్యవస్థను ఏర్పాటు చేసి, వైద్యులకు రక్షణ కల్పించాలి. – డి.రేవతి, ఏఎన్‌ఎం, ఎస్‌కేఆర్ పురం

ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేయాలి



కోల్‌కతా వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి కిరాతకంగా హతమార్చారు. ఆసుపత్రిలో వైద్యులతోపాటు సిబ్బందికి ప్రత్యేక రక్షణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలి. అలాగే మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి, ఇలాంటి సంఘటనలపై అవగాహన కల్పించాలి. – కె.జయలక్ష్మి, ఏఎన్‌ఎం, ఆముదాల

సమస్యల సుడిలో వ్యవసాయం

- ఖరీఫ్ ప్రారంభంలోనే నష్టపోయిన రైతులు
- ప్రతికూల వాతావరణంతో వరి పంటపై తెగుళ్ల దాడి
- రైతన్నకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి
- తొలకరి మొదలై రెండు నెలలైనా ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్ సాయం కోసం రైతుల ఎదురుచూపు
- గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతు భరోసా సాయం
- పంట నష్టం వాటిల్లితే సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ



వర్షాం రాకపోవడంతో ఎండి పోతున్నా వేరుశనగపంట

శ్రీరంగరాజపురం: ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. వ్యవసాయం చేయడం పాపంలా ఉంది. వర్షాలు కురుస్తాయని ఆశతో పంటలు సాగుచేస్తున్నా ఇంత వరకు వరుణుడు కరుణించడం లేదు. వర్షం వస్తుందన్న నమ్మకంతో రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, కంది, జొన్న, ఆముదం, సోయా తదితర పంటలను వేశారు. కురిసిన కొద్దిపాటి వర్షానికి పంటలను సాగు చేశారు. వస్తుందన్న వర్షం అప్పుడప్పుడు చిరుజల్లులతో ఊరిస్తోంది. అయితే ఒక్కసారి కూడా పదును వర్షం కురవకపోవడంతో వేసిన పంటలు ఎండు దశకు చేరుకున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళనలు మొదలైంది. ఈ ప్రతికూల వాతావరణంలో తెగుళ్లు విజృంభిస్తున్నాయి. నివారణ చర్యలతో రైతులకు పెట్టుబడులు తడిసి మోపెడవుతున్నాయి. రైతులకు రూ.20 వేలు సాయం అందిస్తామన్న కూటమి ఎన్నికల హామీ ఆచరణకు నోచుకోక రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది.



వరి తెగుళ్లకు పచికారి వేస్తున్నా రైతు

అప్పు చేసి సాగు

అప్పుచేసి సాగు చేసినా ఇంత వరకు ఈ క్రాప్ నమోదు చేయకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అనుకోని విపత్తు జరిగితే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందో లేదో అనే ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఏటా పంటలు సాగు సమయంలోనే వ్యవసాయధికారులు పంట పొలాలు వద్దకు వచ్చి ఈ క్రాప్ నమోదు చేసేవారు. దీంతో ప్రభుత్వం నుంచి పరిహారం అందేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనబడడం లేదు.

అందని అన్నదాత సుఖీభవ సాయం

రైతన్నలకు ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తామని కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక వైఎస్ఆర్ సీపీ గతంలో అమలు చేసిన రైతు భరోసా సాయం పేరును మార్చింది గానీ సాయం అందించడం లేదు. తొలకరి సాగు మొదలై రెండు నెలలు కాగా ఎన్నికల హామీపై ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. పీఎం కిసాన్ తొలి విడత జూన్‌లో కేంద్రం రూ.2 వేలు చొప్పున రైతుల ఖాతాలకు జమ చేయగా అన్నదాత సుఖీభవ సాయం విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారు.

ఎలుకలు, తెగుళ్లతో కలవరం

అసలే వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడి సాయం వస్తుందో లేదో అని కలవరం దీనికి తోడు ఎలుకలు, తెగుళ్లతో రైతన్నలలో కలవరం మొదలైంది. వరి, వేరుశనగ, కందులు, జొన్నలు ఇలా ఏ పంటలలో అయిన ఎలుకలు బెడద ఎక్కువగా ఉంది. దీనికి తోడు ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పంటపై తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ పిలకల వేసే దశ నుంచి చిరుపొట్ట దశల్లో ఉంది పలుచోట్లా మాగుడు, కాండం తొలుచు, నల్లి తదితర తెగుళ్లు పంటలను ఆశిస్తుండడం రైతులను కలవర పరుస్తున్నాయి. తెగుళ్లను అరికట్టేందుకు మందుల పిచికారీ కోసం ఎకరాకు రూ.2 వేలు వరకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు.

గత ప్రభుత్వంలో సాగుకు ముందే సాయం

గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో పెట్టుబడి సాయం కోసం రైతులు ఇబ్బంది పడాల్సిన పని లేకుండా సాగు ప్రారంభానికి ముందే వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా సాయం అందించేది. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం 6 వేలకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 చొప్పున జత చేసి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతలు,రబీ ఆరంభంలో మూడు విడతలుగా అందించేది. తొలివిడతగా రైతులకు రూ.7,500 చొప్పున మే నెలలోనే నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాలకు జమ చేసేవారు. తొలకరి పంట పెట్టుబడి కోసం సన్న, చిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది. ఏ సీజన్‌లో పంట నష్టం వాటిల్లితే అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేవారు. తద్వారా రైతుల నష్టం నుంచి తెరుకునేందుకు వీలుండేది.

హామీలను అమలు చేయాలి



అధికారంలోకి వస్తే ఏటా రైతులకు రూ.20 వేలు చొప్పున సాయం అందిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని మర్చిపోయారు. పంట పెట్టుబడి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. పెట్టుబడి సాయం ఇస్తే రైతులకు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ఎంతో ఆసరాగా ఉంటుంది. అన్నదాత సుఖీభవ పథకం సాయం కోసం ఎదురుస్తున్నాం.
– వి.జయశంకర్, రైతు, పెద్దతయ్యూరు గ్రామం

మూడెకరాలు కౌలుకు తీసుకున్నా



మూడెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నా. ఒక్కో ఎకరానికి రూ.22 వేలు పెట్టుబడి పెట్టా. ఇటీవల వర్షాలు కురవకపోవడంతో పంట దెబ్బతినే పతిస్థితి ఉంది. వేరుశనగ మొక్కలు అక్కడక్కడా చనిపోతున్నాయి. ఈ పరిస్థితులు కొనసాగితే నష్టాలు తప్పవు. కౌలు రైతుల్ని ప్రభుత్వం అన్ని రకాలుగా అదుకోవాలి.అన్ని రకాల రాయితీలు కౌలు రైతులకు అందించాలి. – పి.జయరామయ్య, రైతు, శ్రీరంగరాజపురం

చిన్నారికి ఆశీర్వాదం



చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: గంగమాంబాపురం గ్రామంలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు రామిరెడ్డి, వనజ దంపతుల కుమారుడి నామకరణ వేడుకకు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి బుధవారం హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందన్నారు.ఆయన వెంట పట్టాభిరెడ్డి, చందురాజు, కుప్పయ్య, సర్పంచ్ లోకనాథనాయుడు ఉన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్

శ్రీరంగరాజపురం: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ హనుమంతప్ప అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట వద్ద బుధువారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను పాటించాలని, లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని, మద్యం మత్తులో వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. సరైన ధృవ పత్రం లేని వాహనదారులకు చలానా వేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

వెదురుకుప్పం: మండలంలోని కురివికుప్పం సమీపంలో నాటుసారా స్థావరాలపై వెదురుకుప్పం పోలీసులు బుధవారం నిర్వహించిన దాడుల్లో 1000 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు... కురివికుప్పం పరిసరాల్లో నాటుసారా తయారు చేస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారం ఎస్ఐ వెంకటసుబ్బయ్యతోపాటు సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన 1000 లీటర్ల నల్లబెల్లం ఊటను ధ్వంసం చేశారు. అదేవిధంగా సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తునేనట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రభుత్వ నిషేధిత కార్యకలాపాలకు పాల్పడకూడదని సూచించారు.



నాటుసారా స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

తేనెలూరే తెలుగు

- నేడు తెలుగు భాషాదినోత్సవం



గిడుగు వెంకట రామ్మూర్తి

పుత్తూరు: మాటనైనా, పాటనైనా స్పష్టంగా, సరళంగా చెప్పగలిగే, పొడగలిగే అక్షరాల సమూహమే మన తెలుగు భాష ప్రత్యేకత. ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక యుగం వరకు ఎందరో మహానుభావులు మన తెలుగు భాష ఉన్నతికి ఎనలేని కృషి చేశారు. తెలుగు వ్యవహారిక భాష ఉద్యమకర్తగా పేరు గడించిన గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఏటా ఆగస్టు 29న తెలుగు భాషాదినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 'గిడుగు' రచయితగా, చరిత్రకారుడిగా, సంఘ సంస్కర్తగా పేరు గడించారు. ఈయన 1863 ఆగస్టు 29న శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలోని వీర్రాజు, వెంకమ్మ దంపతులకు జన్మించారు. ఈయనకు 1913లో బ్రిటీష్ ప్రభుత్వం 'రావ్ బహదూర్' బిరుదును ఇచ్చి సత్కరించింది. 1919లో గ్రాంధిక భాషను అధిగమించడానికి తెలుగు మాస పత్రికను ప్రారంభించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కళాప్రపూర్ణ బిరుదును అందుకున్నారు. 1940 జనవరి 22న తుదిశ్వాస విడిచారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇందుకు ప్రభుత్వం సైతం నడుం బిగించి, పాలనా వ్యవస్థను సైతం తెలుగులోనే అమలు చేయాలని తెలుగు భాషాభిమానులు అభిప్రాయపడుతున్నారు.



తెలుగు తల్లి

తెలుగులోనే పాలనా వ్యవస్థ ఉండాలి



తెలుగు రాష్ట్రాల్లో పాలనా వ్యవస్థ తెలుగులోనే అమలు కావాలి. కోర్టుల్లో జరిగే వాద ప్రతివాదనలు, తీర్పులు తెలుగులోనే ఉండాలి. వాణిజ్య సంస్థల పేర్లు, ప్రకటనలు తెలుగులోనే ఉండాలి. నాలుగేళ్లకోసారి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తామన్న 2012 నాటి తీర్మానాన్ని అమలు చేయాలి. తెలుగు భాషాభివృద్ధి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలి.
– డాక్టర్.ఎం.నరసింహులు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు

పిల్లల్లో పుస్తక పఠనం పెంపొందించాలి



పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో పిల్లలకు పెద్దలు మానవ జీవితాలను కథలు కథలుగా చెప్పేవారు. కాలక్రమంలో ఆ పద్ధతి కనుమరుగైపోయింది. ఇప్పుడంతా సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్, సోషల్ మీడియా మాయలో పడి పుస్తక పఠనం బాగా తగ్గిపోయింది. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో, మెదడుకు వ్యాయామం అంతే అవసరం. అది పుస్తక పఠనంతోనే సాధ్యం. – జి.మాణిక్యం, రీసెర్చ్ స్కాలర్, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి

బాల సాహిత్యంతో భాషాభివృద్ధి



నేటి తరం పిల్లలు మాతృ భాషకు దూరమవుతున్నారు. వారిలో తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించడానికి బాలసాహిత్యమే ఉత్తమ మార్గం. బాలగేయాల ద్వారా పిల్లల్లో తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించవచ్చు. – పి.యుగంధర్, బాలసాహితీవేత్త

భాష పరిరక్షణకు కృషి చేయాలి



పిల్లలకు తెలుగు పదాలు, పద్యాల ఉచ్చరణ నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఆన్‌లైన్ మార్కెట్‌లో తెలుగు పుస్తకాలను పిల్లలకు అందించాలి. తెలుగు భాషాభివృద్ధికి ప్రోత్సాహకాలను సైతం అందించాలి.
– కె.వి.మేఘునాథ్‌రెడ్డి, నవలా రచయిత, పుత్తూరు

అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి



అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి

నగరి: ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని రెండు రోజుల క్రితం రైల్వే అధికారులు గుర్తించి నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స అవసరం కావడంతో అక్కడి నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ వ్యక్తి అక్కడ చికిత్స పొందుతున్నాడు. వివరాలు తెలిసిన వారు రైల్వేశాఖ వారికి వివరాలు అందజేయాలని పుత్తూరు ఆర్‌పీ ఎస్ఐ రవి బుధవారం తెలిపారు. 99631 26343, 94407 55983 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నూతన అతిథి గృహం ప్రారంభం

నగరి: నేత్రప్రదాయిని దేశమ్మ దేవత ఆలయంలో దాతల సహకారంతో నిర్మించిన అతిథి గృహాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. బుధవారం ఆలయానికి విచ్చేసిన ఆయన ముంబయికి చెందిన దేశయ్య అనే దాత రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అతిథి గృహాన్ని ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

నగరి: మున్సిపల్ పరిధి కొత్తపేటలో గంగమ్మ జాతర వేడుకలు బుధవారం వైభవంగా సాగాయి. డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మంగళవారం రాత్రి గంగమ్మ ఊరి మధ్యలో వేసిన వేపాకు గుడిసెకు వచ్చి చేరింది. బుధవారం ఉదయం నుంచి మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి వేపాకు సారెలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మను దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుష్పాలంకరణ నడుమ గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. రాత్రి గంగమ్మను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు. భారీ రంగుల రాట్నాలు చిన్నారులను అలరించాయి.

విశ్రాంత సైనికుల సమ్మేళనం

పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజుపురంలో రిటైర్డ్ ఆర్మీ జవానులు ఎస్.అపూస్ రాజ్, వి.ధనకృస్ ఆద్వర్యంలో బుధవారం విశ్రాంత సైనికుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి చిత్తూరు, మురకంబట్టు, గంగాధరనెల్లూరు డివిజన్ యూనియన్ అధ్యక్షులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆర్మీలో ప్రాణాలను లెక్క చేయకుండా సరిహద్దుల్లో పని చేసి, రిటైర్యామని తెలిపారు. ఆర్మీ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలను ఐకమత్యంగా ఉండి సాధించాలన్నారు. అందుకే యూనియన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్మీలో పనిచేసి రిటైరైన 3 సంవత్సరాల్లోగా ప్రతి సైనికుడికి ప్రభుత్వం వ్యవసాయ భూమి ఇవ్వాలని కోరారు. 3 సంవత్సరాలు పైబడిన వారికి ఇది వర్తించదని తెలిపారు. ఇవేకాకుండా ఎన్నో సదుపాయాలు ఉన్నాయని, వీటిని కలసికట్టుగా ఉండి సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సమావేశమైన విశ్రాంత సైనికోద్యోగులు

30న గోకులాష్టమి వేడుకలు

వెదురుకుప్పం: కొమరగుంట పంచాయతీ బందార్లపల్లె గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ భజన మందిరంలో 30న శుక్రవారం గోలాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు సచివాలయ కన్వీనర్ జగదీశ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం విశేష పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం అన్నమాచార్య సంకీర్తనలు, గోపూజ, గో ప్రదక్షిణతో పారంభమై రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి పంచామృత స్నపన తిరుమంజనం చేస్తున్నట్లు చెప్పారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వాహనాల వేలంలో రూ. 2.29 లక్షలు ఆదాయం



ద్విచక్రవాహనాలను వేలం వేస్తున్న పోలీస్ అధికారులు

కార్వేటినగరం: అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం పాటలో ప్రభుత్వానికి రూ.2,29,330 ఆదాయం వచ్చినట్లు ఎస్ఈబీ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు, ఆటో వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐలు రాజ్‌కుమార్, భారతి, ఏఎస్ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు

పుత్తూరు: రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-11, 13, 15, జూనియర్ విభాగాల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 25, 26 తేదీల్లో రేణిగుంట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వడమాలపేటకు చెందిన విద్యార్థులు వివిధ కేటగిరీల పోటీల్లో 13 బంగారు, 9 రజత, 9 కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం కరుణానవనీతం తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వెల్లడించారు. అక్టోబర్ నెలలో హర్యానా రాష్ట్రం రోహతక్‌లో జరిగే జాతీయ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు